# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 30, జనవరి 2026


## భక్తుల కోరికలు తీర్చే వన దేవతలు సమ్మక్క సారలమ్మ: మంత్రి వివేక్



**రామకృష్ణాపూర్, జనవరి 29, ప్రభాతవార్త**

భారతదేశంలో అతి పెద్ద గిరిజన మహా జాతర తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యం లో కోట్లాది మంది భక్తుల కొంగు బంగారం, భక్తుల కోరికలు తీర్చే వన దేవతలు సమ్మక్క సారలమ్మలు అని తెలంగాణ రాష్ట్ర, భూ గర్భ గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. గురువారం పట్టణం లోని ఆర్.కె 1ఏ అటవీ ప్రాంతం లో పాలవాగు ఒడ్డున కొలువు దీరిన సమ్మక్క, సారాలమ్మ లను ఏఐటీయూసి రాష్ట్ర అధ్య క్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, మందమర్రి ఏరియా జి.ఎం రాధా కృష్ణ లతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ భక్తుల సౌకార్యర్థం సింగరేణి యాజామాన్యం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్య లో సమ్మక్క సారలమ్మలను దర్శనం చేసుకొవాలని కోరారు.

## అక్రమ మద్యం దందా...







**చింతలమానేపల్లి, జనవరి 29, ప్రభాతవార్త**

మండలంలో అక్రమ మద్యం తరలింపు వ్యవహారం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. మండలంలో గల మద్యం దుకాణల నుంచి మిట్ట మధ్యాహ్నం పూటనే ప్యాసింజర్ ఆటోల ద్వారా మద్యం అక్రమంగా తరలిస్తూ, మండల కేంద్రం నుంచి గూడెం ప్రధాన రహదారి మీదుగా బహిరంగంగానే రవాణా కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారులపై ఇలాంటి అక్రమ రవాణా నిర్బంధం లేకుండా సాగుతుండటంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

2లో..

### కాంగ్రెస్ కుట్ర రాజకీయాలకు

## సిట్ నోటీసులే నిదర్శనం

*ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్



**కాగజ్‌నగర్, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని, తమ అధినేత మాజీ ముఖ్యమంత్రి కే.సి.ఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనమని బి.ఆర్.ఎస్ ఎం.ఎల్.సి దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. కాగజ్‌నగర్ మునిసిపల్ ఎన్నికల పరిశీలకులుగా వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చరిత్రలోనే ఈ రోజు బ్లాక్ డేగా పరిగణించాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. కే.సి.ఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం వల్లే నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. నైతికంగా బి.ఆర్.ఎస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేకనే కాంగ్రెస్ పార్టీ దొంకతిరుగుడు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. గడిచిన 24 నెలల్లో రెండు సార్లు సిట్ నోటీసులు ఇవ్వడం చరిత్రలోనే తొలిసారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి కుళ్ల రాజకీయాలను తెరపైకి తీసుకొచ్చి పబ్బం గడపడమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. రానున్న మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పే రోజులు మిగతా 2లో..

## అనుమానస్పద స్థితిలో మహిళ మృతి



### దహేగాం మండలంలో కలకలం



**దహేగాం, జనవరి 29, ప్రభాతవార్త:**

కుమ్రంభీం జిల్లా దహేగాం మండలంలోని బోర్లకుంట గ్రామపంచాయితీ పరిధిలోని రాళ్ళగూడ గ్రామానికి చెందిన వివాహిత ఆత్మకూరి కళావతి (35) బుధవారం అనుమానస్పద స్థితిలో మృతిచెందడం కలంకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు బుధవారం ఉదయం తమ పిల్లలు చదువుకుంటున్న ఇట్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో పోషకుల సమావేశం ఉండడంతో కళావతి ఈ సమావేశానికి ఇంటినుండి బయలు దేరింది. కాగా బుధవారం రాత్రి వరకు కళావతి ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటీంబీకులు గ్రామస్థుల సహాయంతో ఆమే ఆచూకి కోసం వెతుకుతుండగా రాళ్ళగూడ గ్రామసమీపంలోని పత్తిచేనులో శవమై కనిపించింది. దీంతో కుటీంబీకులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం మిగతా 2లో..

# అక్రమ మద్యం దందా...

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే గూడెం మద్యం దుకాణాన్ని అధికారులు సీజ్ చేసినప్పటికీ, అదే అవకాశంగా మలుచుకున్న అక్రమ మద్యం మాఫియా గూడెం ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని తమ దందాను విస్తరిస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలం నుంచి మద్యం నిల్వలను మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు తరలించి అక్కడ అధిక ధరలకు అమ్ముతూ భారీగా అక్రమ లాభాలు గడిస్తున్నారని చెబుతున్నారు.

### ప్యాసింజర్ ఆటోలతో తరలింపు..

అధికారుల కంటికి దూరంగాప్యాసింజర్ ఆటోలు వంటి సాధారణ వాహనాలను వినియోగిస్తూ అధికారుల దృష్టిని మళ్లించి నిర్బంధం తప్పించుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. పగటి పూటనే అక్రమ రవాణా సాగుతున్నా ఎక్సైజ్ శాఖ సిబ్బంది పర్యవేక్షణ పూర్తిగా కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### అధికారుల హస్తం ఉందా...?

ఈ అక్రమ దందా వెనుక అధికారుల మౌన సహకారం ఉందా అనే సందేహాలు ప్రజల్లో కూడా వ్యక్తమవుతున్నాయి.

### యువత భవిష్యత్తుకు ముప్పు...

ఈ అక్రమ మద్యం కారణంగా మండలంలోని యువత వ్యసనాలకు బానిసలవుతుండగా, గ్రామీణ శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఈ అక్రమ దందాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.




## బెల్టు దుకాణాలపై పోలీసుల దాడులు

**- రూపాయలు 7920 విలువచేసే మద్యం బాటిళ్లు స్వాధీనం**

చెన్నూరు రూరల్, జనవరి 29, ప్రభాతవార్త

రాష్ట్రంలో మున్సిపల్ ఎలక్షన్ కోడ్ ఉన్నందున ఎవరైనా బెల్టు దుకాణాల్లో అక్రమంగా మద్యం అమ్మినట్లైతే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ బన్సీలాల్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని మహంకాళి వాడకు చెందిన వొడ్నాల సంతోష్ అనే వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం మేరకు బెల్టు షాపులో సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 7920 రూపాయల విలువగల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బన్సీలాల్ పేర్కొన్నారు. అక్రమంగా మద్యం అమ్మినట్లైతే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కుట్ర రాజకీయాలకు

# సిట్ నోటీసులే నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి)

దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.బి.ఆర్.ఎస్ పార్టీకి పునర్వైభవం తెచ్చేలా ప్రజలు కాంక్షిస్తున్నారని, అది ఓర్వలేకే కాంగ్రెస్ నాయకులు చౌకబారు రాజకీయాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే బి.ఆర్.ఎస్‌పై దాడులు చేస్తోందని విమర్శించారుప్రజా సమస్యలు పక్కనబెట్టి కేసులు, నోటీసులతో పాలన సాగిస్తోందన్నారుఈ తీరుకు ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారుబి.ఆర్.ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారుసిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీపై కక్ష సాధింపు రాజకీయాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. రానున్న మునిసిపల్ ఎన్నికల్లోనే కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఎం.పి.టి.సి, జడ్.పి.టి.సి ఎన్నికల్లోనూ ఇదే తీర్పు ఉంటుందని అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు.అనంతరం బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్పలు మాట్లాడుతూ, బి.ఆర్.ఎస్ పార్టీపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుకు ప్రజలు త్వరలో జరగనున్న మునిసిపల్, ఎం.పి.టి.సి, జడ్.పి.టి.సి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో మహిళ మృతి

(మొదటిపేజీ తరువాయి)

అందించారు. కాగా కళావతి భర్త సంతోష్ ఉపాధికోసం హైదబాద్ పట్టణానికి వెళ్ళి పనిచేస్తుండగా భార్య మరణవార్త తెలుసున్న వెంటనే తన స్వగ్రామానికి గురువారం చేరుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆపన్న హస్తానికి ఎదురుచూపులు

**- కిడ్నీల వ్యాధితో బాధపడుతున్న మహిళ**

కెరమెరి, జనవరి 29, ప్రభాతవార్త:

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, కెరమెరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బొమ్మెన శీరిష తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టలాడుతోంది. రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు ఆ నిరుపేద కుటుంబానియిూ ఆమెకు రెండు కిడ్నీలు పూర్తిగా పాడవడంతో చికిత్స అత్యవసరంగా మారింది. ఈమెకు పదేళ్లలోపు ముగ్గురు పిల్లలు ఉండగా, వారిలో ఒక అమ్మాయి వికలాంగురాలు. ఇద్దరు కుమారులు చిన్నవయసులోనే జీవనపోరాటాన్ని ఎదుర్కొంటున్నారు. ఈమె భర్త కూడా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఇంట్లో ఉంటూ ఏమి పని చేయలేని పరిస్థితిలో ఉన్నాడు. ఈమెకు ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా చిల్లిగవ్వ లేని పరిస్థితిలో ఉంది. ఈమె కుటుంబం దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఆదుకోవాలని వేడుకుంటుంది. ఈమెకు పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి వారు అండగా నిలిచారు. దయచేసి దాతలు మానవతా దృక్పతంతో స్పందించి మీకు తోచిన ఆర్థిక సహాయం అందించగలరని కోరుతున్నాము. ఫోన్ పే నెంబర్ 9666322124 పెందోర్.శ్రీనివాస్.



## కేయూ ఓపెన్ పీజీ, డిగ్రీ కోసం మార్చి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోగలరు

**- ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్**

బెల్లంపల్లి, జనవరి 29, ప్రభాతవార్త

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గల కాకతీయ విశ్వ విద్యాలయం దూరవిద్య ( ఎస్‌డిఎల్‌సిఈ) పిజి, డిగ్రీ కోర్సులలో ప్రవేశానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26లో పీజీ లేదా డిగ్రీ చేసేందుకుగాను మార్చి 25 వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ పీజీలో ఎంఏలో అన్ని సబ్జెక్టులలో, ఎం.కామ్ చదివేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే ఓపెన్ డిగ్రీలో బిఏ, బీకాం, బీఎస్సీ అన్ని కోర్సులలో అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు. దూరవిద్య ద్వారా పీజీ లేదా డిగ్రీ చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీజీ చేసేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్ 770 ద్వారా, డిగ్రీ చదివేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్ 043 ద్వారా ఆన్లైన్ లో డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌డిఎల్‌సిఈకేయూ.కో.ఇన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకొని ప్రింట్ అవుట్ కు సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి 2 సెట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గల కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య స్టడీ సెంటర్లో అడ్మిషన్ అప్లికేషన్ ఫామ్స్ నింపి అందజేయాలని ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ కోరారు. వివరాలకు 9959269975 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## మంచిర్యాలలో సమ్మక్క సారలమ్మ జాతర వైభవం

మంచిర్యాల, జనవరి 29, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి నది తీరంలో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. మేడారం జాతరను తలపించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేయడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకురావడంతో వేడుకలు మొదలయ్యాయి. గురువారం చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెపైకి కొలువుదీరడంతో భక్తుల జయజయధ్వానాల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని బంగారంగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో గోదావరి తీరం సందడిగా మారింది. భక్తులు కోళ్లు, మేకలను బలి ఇచ్చి వనదేవతలకు నైవేద్యాలు సమర్పించి వన భోజనాలు చేస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లలో మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మున్సిపల్ శాఖ పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తోంది. తోపులాటలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచుతూనే, అత్యవసర చికిత్స కోసం వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచారు. మంచిర్యాల పరిసర ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలిరావడంతో తీరమంతా జనసంద్రమైంది. ఈ జాతర శనివారం వరకు కొనసాగుతుంది.



# నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

ఆసిఫాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:



రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ స్వీకరణలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర సాధారణ పరిశీలకులు కుమార్ అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని నామినేషన్ కేంద్రాన్ని నోడల్ అధికారి అశ్వక్ అహ్మద్ తో కలిసి సందర్శించి సాగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో గల 20 వార్డులకు జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు వచ్చిన అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించాలని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని లోనికి అనుమతించకూడదని అధికారులకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల కార్యాచరణ ప్రకారం నామినేషన్ స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్, కౌంటింగ్ ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కరెంట్ బాధలు తీర్చిన సర్పంచ్

**సారంగాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలోని శాంతినగర్‌కాలనీలో కరెంటు సక్రమంగా లేకపోవడంతో ఎక్కువ, తక్కువవడం ద్వారా టీవీలు, ఫ్యాన్లు చెడిపోయింది. దీనిని కాలనీవాసులు సర్పంచ్ బల్గురి అజయ్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డికి తెలుపగా వెంటనే స్పందించి 100 కేవిడిటిర్‌ని ఏర్పాటు చేయించారు. అందుకు కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సాయి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతుతు ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథులు

## మండల స్థాయి సీఎం కప్ విజేతలకు బహుమతులు

**సారంగాపూర్, జనవరి28, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీఎం కప్ పోటీలలో విజేతలకు ఎమ్మార్వో సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంతలు, ఎంఈఓ మహేందర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచినటువంటి వారు తాలూకా స్థాయిలో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మంచి ప్రతిభ కనబరిచి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్ అథ్లెటిక్స్‌లలో విజేతలుగా నిలిచి మండలానికి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భూమన్న, సాయన్న, ఎంపీవో అజీజ్ ఖాన్, అన్ని పార్టీల నాయకులు వ్యాయామ ఉపాధ్యాయులు, యువత, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



## చెస్ కాంపిటేషన్లో మొదటి బహుమతి సాధించిన విజేత విద్యార్థి

**దిలావర్‌పూర్, జనవరి29, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని విజేత స్కూల్ నందు చదువుతున్న విద్యార్థి బన్సోడె అశ్వంత్ ముధోల్ మండల చెస్ కాంపిటీషన్లో మొదటి బహుమతి సాధించాడు. గత కొంతకాలంగా చెస్ ఆట చురుకుగా ఆడుతుండటంతో తండ్రి చంద్రకాంత్ సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా చెస్ పోటీల్లో ఆడించడంతో గురువారం ఆడిన చెస్ పోటీల్లో ముధోల్ మండలంలో మొదటి బహుమతి సాధించారు. ప్రధానోపాధ్యాయుడు సుఖేష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జనవరి 29, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్న వారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని అనుమతించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు పూర్తి చేసిన అభ్యర్థులు హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు.





మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఏఐటీయుసి రాష్ట్ర నాయకుడు కుంటల రాములు

## మధ్యాహ్న భోజన పథకం బిల్లులు వెంటనే చెల్లించాలి

**బజార్‌హత్నూర్, జనవరి 29, ప్రభాతవార్త:**

మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయుసి రాష్ట్ర నాయకుడు కుంటల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంటల రాములు మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న కార్మికులను నిరక్ష్యం చేయడం తగదన్నారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని, దానితో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు సామాజిక భద్రత పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఏఐటీయుసి ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు కార్మికులు, సంఘ నాయకులు కీర్తి రమణ, అనిత, లక్ష్మి, బి లక్ష్మి, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కార్మికుల వైద్యసేవలకు అధిక ప్రాధాన్యత: జి.ఎం. రాధాకృష్ణ

**- కేకే-I డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభం**

**మందమర్రి, జనవరి29 ప్రభాతవార్త**





సింగరేణి సంస్థ కార్మికుల ఆరోగ్య సంరక్షణకు, వైద్యసేవల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ స్పష్టం చేశారు. గురువారం ఉదయం మందమర్రి పట్టణంలోని కేకే-1 డిస్పెన్సరీ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, మందమర్రి ఏరియాలో పనిచేస్తున్న కార్మికులతో పాటు రిటైర్డ్ కార్మికులకు కూడా ఈ ఫిజియోథెరపీ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి చిన్న సమస్యకు మందులపై ఆధారపడటం వల్ల దుష్ప్రభావాలు వచ్చే అవకాశముందని, ముఖ్యంగా కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు వంటి అనేక వ్యాధులను ఎక్సర్సైజ్‌లు, ఫిజియోథెరపీ చికిత్సల ద్వారా చాలావరకు నివారించవచ్చన్నారు. భవిష్యత్తులో ఫిజియోథెరపీ కేంద్రంలో అవసరాన్ని బట్టి మరిన్ని పరికరాలను ఏర్పాటు చేసి, ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గుర్తింపు కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం కార్మికుల కోసం అందిస్తున్న వైద్యసేవలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే కేకే-1 డిస్పెన్సరీలో హెచ్1బి, హెచ్1ఏ, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులకు సంబంధించి నిర్ధారిత రక్త పరీక్షలను నిర్వహించే ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. డీవైసీఎంఓ డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ, ఫిజియోథెరపీ ద్వారా కీళ్ల నొప్పులు, నరాల సమస్యలు, శారీరక బలహీనత వంటి అనేక సమస్యలకు సమర్థవంతమైన చికిత్స లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం జీ.ఎల్. ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, సివిల్ ఎస్ఈ శ్రీధర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. నాగేశ్వర్ రావు, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రమణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జీఎంను సన్మానించిన రిటైర్డ్ కార్మికులు**

మందమర్రి ఫిజియో థెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ, డీవైసీఎంవో డాక్టర్ మధుకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.నాగేశ్వర్ రావులు సింగరేణి రిటైర్డ్ కార్మికులు శాలువాలు కప్పి సన్మానించారు. రిటైర్డ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వాదాల శంకర్,దాసరి రామన్న,కంబాల రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహితం సాగుపై రైతులకు అవగాహన

**తాండూర్, జనవరి 29, ప్రభాతవార్త**

మండలంలోని గోపాలనగర్ రైతులకు గురువారం జాతీయ ప్రకృతి వ్యసాయ మిషన్ లో భాగంగా పర్యావరణ హితంగా సాగుపై మండల వ్యవసాయ శాఖ అధికారి సుష్మ అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడడం తగ్గించాలని, సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాట్ల నరసయ్య, ఏఈఓ శంకర్ రైతులు పాల్గొన్నారు.



# సింగరేణి ఉద్యోగులకు చేరువగా సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సేవలు

**- శ్రీరాంపూర్‌లో సీకేర్ పోర్టల్‌పై ఉన్నతాధికారుల సమీక్ష**

నస్పూర్, జనవరి 29, ప్రభాతవార్త

ఉద్యోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించామని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ పోర్టల్ (సీకేర్) పై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోర్టల్ పనితీరు, ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలపై సుదీర్ఘంగా చర్చించారు. సింగరేణి కార్మికులు తమ భవిష్య నిధి ఖాతా వివరాలను వేగంగా, పారదర్శకంగా తెలుసుకోవడానికి ఈ సాంకేతికత దోహదపడుతుందని అధికారులు వెల్లడించారు. జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సౌకర్యార్థం ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయమన్నారు. కార్మికులు తమ సీఎంపీఎఫ్ ఖాతా సమాచారాన్ని ఎక్కడి నుంచైనా సులభంగా చూసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశం ద్వారా పోర్టల్ వినియోగంపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునే వీలు కలిగిందన్నారు. క్షేత్రస్థాయిలో దీనిపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. సీఎంపీఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ సెటిల్మెంట్లు త్వరితగతిన పూర్తి చేయడానికి ఈ పోర్టల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. అన్ని ముఖ్యమైన వివరాలు ఒకే చోట లభించడం వల్ల జాప్యం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ మోహిత్ వేద్, రీజనల్ కమిషనర్-1 హరి పవోరీ, రీజనల్ కమిషనర్-2 డాక్టర్ గోవర్ధన్ పాల్గొని ఆన్‌లైన్ విధానంపై వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, కమ్యూనికేషన్స్ సెల్ అధికారి ఎస్. సురేందర్ పాల్గొన్నారు. వివిధ గనుల సంక్షేమ అధికారులు, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.



సీకేర్ పోర్టల్‌పై సమీక్ష నిర్వహిస్తున్న సీఎంపీఎఫ్ ఉన్నతాధికారులు



పోటీలలో గెలుపొంది క్రీడాకారులతో జడ్పీ సీఈఓ శంకర్

## ఆటల్లో రాణించి క్రీడాకారులు మంచి గుర్తింపు తేవాలి

దిలావర్‌పూర్, జనవరి 29, ప్రభాతవార్త:

జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని జెడ్పి సీఈవో శంకర్ అన్నారు. గురువారం దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలాం గ్రామంలో మండలస్థాయి రెండవ విడత సీఎం కప్ పోటీలో నిర్వహించారు. అన్ని గ్రామాల నుండి వచ్చిన క్రీడాకారులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు అవార్డ్స్ మెడల్స్ అందజేశారు. జిల్లాస్థాయిలో వీరు ఆడి రాష్ట్రస్థాయిలో మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రాణి, ఎంఈఓ సదానందం, వ్యాయామ ఉపాధ్యాయులు అంబాజీ రాజు, సర్పంచ్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు

## సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

హాజీపూర్, జనవరి 29, ప్రభాతవార్త

క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతాయని హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, ఎంపీడీవో వెంకటరెడ్డి తెలిపారు. గురువారం రాంపూర్ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు ఈనెల 31 వరకు జరుగుతాయి. విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుడిపేట 13వ బెటాలియన్‌లో కారుణ్య నియామకం

హాజీపూర్, జనవరి 29, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేశారు. గతంలో ఇక్కడ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన సాలిగంటి లచ్చయ్య కుమారుడు సాలిగంటి సుమంత్‌కు ఈ ఉద్యోగం లభించింది. జిల్లా కలెక్టర్, నోడల్ అథారిటీ ఆదేశాల మేరకు సుమంత్ ను జూనియర్ అసిస్టెంట్ గా నియమించారు. బెటాలియన్ కమాండెంట్ పి.వెంకట రాములు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ వృత్తి పట్ల క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ, నిబద్ధతతో పనిచేసి విభాగానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గౌస్ ఉద్దీన్, ఆర్ఐ సతీష్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




నియామక పత్రం అందజేస్తున్న కమాండెంట్ వెంకట రాములు

## బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల, జనవరి 29, ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. 52వ డివిజన్ నాయకులు కోటగిరి రవి, స్వాతి, 56వ డివిజన్ సీనియర్ నాయకులు వెంగళ కొమురయ్య, 23వ డివిజన్ నాయకులు రౌతు వెంకటేష్ గురువారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ జాతీయ నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగపల్లి వెంకటేశ్వర్ రావు, గాజుల ముఖేష్ గౌడ్, అమిరిశెట్టి రాజ్ కుమార్, చిట్టినేని హనుమంత్ రావు, బింగి ప్రవీణ్, బోయిని దేవేందర్, గాజుల ప్రభాకర్ పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న నాయకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న పార్టీ నేతలు

## ఉద్యాన పంటల సాగుకు రైతులకు ప్రోత్సాహకాలు

ఆసిఫాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రణాళిక పథకమైన ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించటం కొరకు జిల్లాలో కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు 50 రాయితీ పైన ప్లాస్టిక్ బుట్టల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి నదీమ్ గురువారం తెలిపారు. ఇందులో భాగంగా ఒక్కో రైతుకు గరిష్ఠంగా 40 ప్లాస్టిక్ బుట్టలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జనరల్, బీసీ రైతులకు 735, ఎస్సీ రైతులకు 154, ఎస్టీ రైతులకు 93 ప్లాస్టిక్ బుట్టలు కేటాయించామని తెలిపారు. మహిళా రైతులకు 33 కోటాకు గాను 330 ప్లాస్టిక్ బుట్టలు కేటాయించామని తెలిపారు. ఒక్కో బుట్ట ఖరీదు రూ .337/ కాగా అందులో రైతు ఒక్కో బుట్టకు రూ.168.50/ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక రైతు 40 ప్లాస్టిక్ బుట్టల కోసం రూ.6740 డిడి రూపంలో చెల్లించి లబ్ధి పొందాలని తెలిపారు. మరింత వివరాల కోసం కాగజనగర్ డివిజన్ రైతులు ఉద్యాన అధికారిని సుప్రజ సెల్ నెంబర్ 8977713965, ఆసిఫాబాద్ డివిజన్ రైతులు జిల్లా ఉద్యాన అధికారి యంఎ అబ్దుల్ నదీమ్ ఖుద్దుసి, సెల్ నెం 8977713964 సంప్రదించాలని తెలిపారు.



ఎమ్మార్వోను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

## ఎమ్మార్వోను కలిసిన రేషన్ డీలర్లు

దిలావర్‌పూర్, జనవరి 29, ప్రభాతవార్త:

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ ఏజాజ్ హమీద్ ఖాన్‌ను గురువారం మండల రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తమ ఉద్యోగిగా ఈనెల 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్వోను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ అధ్యక్షుడు చిన్నయ్య ఉపాధ్యక్షుడు మధుకర్, కార్యవర్గ సభ్యులు సుభాష్, రాజేశ్వర్, సాగర్ తదితరులు ఉన్నారు.

## గుండంపల్లి వెంకటేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

దిలావర్‌పూర్, జనవరి 29, ప్రభాతవార్త:

దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామంలో గురువారం జరుగుతున్న వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆయనకు సన్మానం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇందులో గ్రామ సర్పంచ్ రమణారెడ్డి, మాజీ ఎంపీపీ చిన్నారెడ్డి, నాయకులు దేవేందర్ రెడ్డి, నిర్మల్ బీఆర్ఎస్ నాయకుడు రామ్ కిషన్ రెడ్డి, గ్రీన్ ఇండియా చాలెంజ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ రాథోడ్, నర్సాపూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధన్, తుడుం దెబ్బ ఉపాధ్యక్షుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.



బోథ్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

# నామినేషన్ ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**లక్షెట్టిపేట, జనవరి 29, ప్రభాతవార్త**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజలతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ... 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదులకొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టి), స్టాటిక్ సర్వైలెన్స్ (ఎస్ఎస్‌టి) బృందాల సభ్యులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డి. హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాల పాత్ర కీలకమని తెలిపారు. నగదు, మద్యం, బహుమతుల పంపిణీపై నిరంతర నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. ప్రతి తనిఖీని వీడియో రికార్డు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణ అనంతరం ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాల కోసం కేటాయించిన వాహనాలను కలెక్టర్, సాధారణ పరిశీలకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనాలు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారం భక్తులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

**- శ్రీరాంపూర్ బస్టాండ్ వైద్య శిబిరంలో అవగాహన కార్యక్రమం**

**నస్పూర్, జనవరి 29, ప్రభాతవార్త**

అవగాహనతోనే వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పేర్కొన్నారు. నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ బస్టాండ్ ఆవరణలో మేడారం జాతర భక్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గురువారం ఆయన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. జాతరకు వెళ్లే భక్తులు ప్రయాణాల్లో తగు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రయాణాల్లో ముఖ్యంగా వృద్ధులు, గర్భవతులు, చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని వెంకటేశ్వర్ తెలిపారు. జాతరలో జనసందోహం ఎక్కువగా ఉన్నందున పరిశుభ్రమైన మంచినీటిని తాగాలని సూచించారు. వంటలకు కూడా సురక్షితమైన నీటినే వినియోగించాలని వివరించారు. దుమ్ము ధూళి పడిన ఆహార పదార్థాలు, ఈగలు వాలిన తినుబండారాలు తినరాదని హెచ్చరించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా ఇన్ఫెక్షన్లను అరికట్టవచ్చని చెప్పారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే గద్దెల సమీపంలోని ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాలను సంప్రదించాలని కోరారు. అత్యవసర వైద్య సేవల కోసం 108 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. భక్తులంతా ఆరోగ్యంగా ఉంటూ సమ్మక్క సారలమ్మను దర్శించుకోవాలని ఆకాంక్షించారు. భైంసా డిపో ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ శిబిరంలో ఏడీసీ నర్సా రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎన్. మమత, ఆరోగ్య కార్యకర్త ఉమా కుమారి, ఆశా కార్యకర్త సుధారాణి పాల్గొన్నారు.



భక్తులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్



## అక్కెపల్లిలోని సమ్మక్క సారక్క జాతరలో పాల్గొన్న మంత్రి వివేక్

**ఘనంగా స్వాగతం పలికిన ఆలయ కమిటీ నిర్వాహకులు**

**చెన్నూరు రూరల్, జనవరి 29, ప్రభాతవార్త**

సమ్మక్క సారక్క అమ్మవార్ల దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లకు మొక్కులు చెల్లించినట్లు రాష్ట్ర మైనింగ్ శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని అక్కెపల్లి గ్రామంలో జరిగే సమ్మక్క, సారక్క జాతరలో ఆయన పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీర్వాదంతో రాష్ట్ర ప్రజలు అయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లకు మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. అంతకు ముందు మంత్రి వివేక్ వెంకటస్వామికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

## విద్యుత్ మోటర్‌కు మరమ్మతులు

**వేమనపల్లి, జనవరి 29, ప్రభాతవార్త**



మండలంలోని ముల్కలపేట గ్రామంలో ముత్తయ్య ఇంటి ముందు ఉన్న విద్యుత్ మోటారు చెడి పోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసుల కష్టాలను తీర్చడానికి ఉప సర్పంచ్ బోర్కుటి నరేష్ స్థానిక సర్పంచ్ ఒడిల కళ్యాణి దృష్టికి తీసుకురాగా గురువారం మెకానిక్ తో చెడిపోయిన విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేపించారు. దీంతో విద్యుత్ మోటర్ మరమ్మతులు కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## 2వ రోజు 30 నామినేషన్లు స్వీకరణ

**లక్షెట్టిపేట, జనవరి 29, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీకి జరిగే ఎన్నికల్లో గురువారం 30 నామినేషన్లను స్వీకరించామని కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు. 1వ వార్డు నుంచి 2, 2వ వార్డు-2, 3వ వార్డు-1, 4వ వార్డు-3, 5వ వార్డు -4, 7వ వార్డు-2, 8వ వార్డు-2, 10 వార్డు-3, 11 వార్డు-4, 12 వార్డ్ -2, 13వ వార్డు-2, 14వ వార్డు-2, 15వ వార్డు-1 నామినేషన్ వచ్చాయన్నారు. 6,9వ వార్డులలో నామినేషన్లు దాఖలు కాలేదు.

## ఉద్యోగానికి రాజీనామా చేసి మున్సిపల్ ఎన్నికల బరిలో గుర్రం శ్రావణి గౌడ్

**బెల్లంపల్లి, జనవరి 29, ప్రభాతవార్త**



ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దొనబండ వెల్‌నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న గుర్రం శ్రావణి తన ఉద్యోగానికి రాజీ నామనేసి ప్రత్యక్షంగా రాజకీయాల్లో వస్తున్నట్లు ఆమె ప్రకటించారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజాసేవ లక్ష్యంగా పనిచేస్తూ అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాలకు వస్తున్న తనను బెల్లంపల్లి పట్టణ ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు.

## నామినేషన్లకు నేడు చివరి రోజు

**ఆసిఫాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కుమురం భీం జిల్లాలో శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో నామినేషన్లు వచ్చే అవకాశం ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. రెండు రోజులకు గాను జిల్లాలోని రెండు మున్సిపాలిటీలకు 104 నామినేషన్లు దాఖలాలు అయినట్లు అధికారులు వెల్లడించారు. మొదటి రోజు 10, రెండో రోజు 94 నామినేషన్లు వచ్చాయన్నారు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ నుండి 32, బీఆర్ఎస్ నుంచి 33, బీజేపి నుంచి 23, బీఎస్పీ 5, ఇతర పార్టీల నుంచి 6, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 5 దరఖాస్తులు వచ్చాయాని ఎన్నికల అధికారులు తెలిపారు



గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గద్దెలపై సమ్మక్కను తీసుకొస్తున్న దృశ్యం



సమ్మక్క దేవత ఊరేగింపులో పాల్గొన్న అధికారులు, కార్మిక నేతలు

# వైభవంగా కొనసాగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర

* గద్దెపై చేరుకున్న సమ్మక్క * మొక్కులు చెల్లించుకున్న భక్తులు
✦ భక్తులతో కిటకిటలాడిన జాతర ప్రాంగణం

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 28, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని నందిగూడ పెద్దవాగు పంప్ హౌజ్ సమీపంలో సమ్మక్క సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతుంది. ఈ నెల 31 వరకు ఈ జాతర జరగనుంది. బుధవారం సారలమ్మ గద్దెపై కొలువుదీరడంతో గురువారం ఉదయం నుండే భక్తులు అక్కడికి చేరుకొని వనదేవతల గద్దెలను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం, చీర, సారే, పసుపు కుంకుమలు సమర్పించి తల్లులకు తమ మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మల దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చారు.



జాతర ఏర్పాట్లపై అడిగి తెలుసుకుంటున్న కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి

## గద్దెలపై సమ్మక్క...

సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా గురువారం రాత్రి భక్తుల ఆరాధ్యదైవమైన సమ్మక్క గద్దెలపై చేరుకున్నారు. ఇప్పటికే గద్దెలపై కొలువుదీరిన సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు దీరారు. ఈ సందర్భంగా జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాంప్రదాయ వాయిద్యాల నడుమ, పూజారుల మంత్రోచ్చారణలతో సమ్మక్కను గద్దెలపై తీసుకొచ్చారు. అమ్మవారి రాకను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనంతో భక్తులు పులకించిపోయారు. సమ్మక్క గద్దెలపై చేరుకున్న సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, నైవేద్యాలతో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భద్రత, త్రాగునీరు, వైద్య సదుపాయాలను కమకూర్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జాతరను శాంతియుతంగా నిర్వహించేందుకు కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. గురువారం కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జాతర నిర్వహణ కమిటి అధ్యక్షుడు తుమ్మ రమేష్, కమిటిసభ్యులకు సూచించారు. సీఐ వెంట కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సందీప్ కుమార్ ఉన్నారు.

## సమ్మక్క సారలమ్మ దేవతలు అందరినీ చల్లగా చూడాలి

- శ్రీరాంపూర్ ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ
- వైభవంగా వనదేవత ఊరేగింపు

**నస్పూర్, జనవరి 29, ప్రభాతవార్త**

సమ్మక్క సారలమ్మ దేవతలు ఉద్యోగులను, పుర ప్రజలను చల్లగా చూడాలి" అని శ్రీరాంపూర్ ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఉన్నత పాఠశాల ప్రాంగణం నుంచి సమ్మక్క దేవత ఊరేగింపును గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వనదేవతల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, అందరికీ క్షేమ లాభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. మేడారం జాతరను తలపించేలా సాగిన ఈ ఊరేగింపులో అధికారులు, కార్మిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్ఓ టు జీఎం ఎన్ సత్యనారాయణ, అరుణ దంపతులతో పాటు బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ వీరభద్ర రావు, కవిత దంపతులు ఊరేగింపును ముందుండి నడిపించారు. ఆలయ పూజారి రమేష్ వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆధ్యాత్మిక శోభతో శ్రీరాంపూర్ ఏరియా అంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఇందారం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి దంపతులు, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి దంపతులు వనదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ పీఓ, కమ్యూనికేషన్ సెల్ అధికారి ఎస్ సురేందర్, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు ముస్కే సమ్మయ్య, కొట్టె కిషన్ రావు, సేవా కార్యదర్శి కొట్టే జ్యోతి తదితరులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.



## మంచిర్యాలలో గద్దెపైకి సమ్మక్క ఆగమనం

- ఆధ్యాంతం భక్తుల కోలాహలం

**మంచిర్యాల, జనవరి 29, ప్రభాతవార్త**

కన్నుల పండుగగా సమ్మక్క తల్లిని ఊరేగింపుగా గౌతమేశ్వర ఆలయ ప్రాంగణం కు తీసుకొచ్చారు. సమ్మక్క రాక సందర్భంగా అధిక సంఖ్యలో భక్తుల పూనకాలు భక్తిమయంతో నినాదాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించి. గోదావరి ప్రాంతంలో జాతరను జరుపుకున్నారు. వన దేవతలు సమ్మక్క సారలమ్మలను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సురేఖ దంపతులు దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకొని భక్తులకు కొంగుబంగారమైన తల్లుల దీవెనలు భక్తులకు ఉండాలని అన్నారు. మంచిర్యాల మరింతగా అభివృద్ధి చెంది ప్రజలు సుభిక్షంగా ఉండాలని అన్నారు. పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన సిబ్బందిని అభినందించారు. మరింతగా ఈ ప్రాంతం వృద్ధిలోకి రావాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటలతో మానసికోల్లసం, ఉత్తమ భవిష్యత్: తహశీల్దార్ వనజారెడ్డి

**జైపూర్, జనవరి 29, ప్రభాతవార్త**

విద్యార్థి దశలో ఆటలు ఆడటంతో మామాసికొల్లాసం, ప్రతి రోజు ప్రాక్టీస్ చేస్తే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని తహశీల్దార్ వనజా రెడ్డి అన్నారు. గురువారం జైపూర్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సీ.ఎం కప్పు ఆటల పోటీలను ఎం.పి.డి.ఓ సత్య నారాయణతో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలకు మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుండి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులను చెన్నూరు నియోజకవర్గం స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండి ఆట, పాటలతో కాల క్షేపం చేయాలని సూచించారు. ఆటలు నేర్చుకొని, సాధన చేస్తూ, పోటీలలో పాల్గొనాలని అన్నారు. పోటీలలో గెలుపు, ఓటములు సహజమని, రెండింటిని సమానంగా తీసుకోవాలని, తద్వారా మానసిక దృఢత్వం సంతరిస్తుందని అన్నారు. పోటీలలో గెలుపొందడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సైతం సాధించ వచ్చని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆట, పాట లపై దృష్టి సారించి ఉత్తమ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని కోరారు. యొక్క కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీపతి బాపూ రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, జైపూర్ హెడ్మాస్టర్ శ్రీనివాసు, పిడిలు సిరంగి గోపాల్, పద్మ, పున్నం సంతోష్, సాయి శ్రీనివాస్‌లు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పాలవాగు ఒడ్డున గద్దెలపై సమ్మక్క సారలమ్మలను ప్రతిష్టించిన జీఎం రాధా కృష్ణ

- మొక్కులు చెల్లించుకున్న బెల్లంపల్లి ఏసిపి

**రామకృష్ణాపూర్, జనవరి 29, ప్రభాతవార్త**

ఆర్.కె.1ఏ గని సమీపంలోని అటవీ ప్రాంతం, పాలవాగు ఒడ్డున ఉన్న గద్దెలపై మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ సమ్మక్క సారాలమ్మ లను ప్రతిష్టించారు. గురువారం సమ్మక్క తల్లి ఆగమనం తో జాతర మహా గట్టానికి చేరుకోంది. మందమర్రి పట్టణంలోని ప్రధాన పూజారి దూలం కనకయ్య గృహంలో కుంకుమ భరణి రూపం లో ఉన్న సమ్మక్క తల్లి కి మేడారం నుండి కోయ పూజారులు సంప్రదాయ బద్దంగా పూజ క్రతువులు నిర్వహించారు. అక్కడి నుండి ఆర్.కె1ఏ గని ప్రక్కనే ఉన్న ఆలయానికి చేరుకోగానే మందమర్రి ఏరియా జి.ఎం రాధాక్రిష్ణా తన అధికార బృందంతో అమ్మవారిని ఎదుర్కొని డప్పు చప్పుల్లా మధ్య గద్దె పైకి తీసునివేళ్ల గా, మహిళలు, మంగళ హారతులతో, కోళ్లతో ఎదురు మొక్కుల మధ్య సమ్మక్క తల్లి వైభవంగా గద్దె పై ప్రతిష్ట కన్నుల పండువగా జరిగింది. అనంతరం జిఎం దంపతులు, సింగరేణి అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్, మందమర్రి సీ.ఐ పర్సా రమేష్, పట్టణ ఎస్ఐ శ్రీధర్‌లు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులు అమ్మ వార్ల ను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



## జాతరలకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి

**జైపూర్,జనవరి 29, ప్రభాతవార్త**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి వివేక్ అన్నారు. మేడారం సమ్మక సారలమ్మ జాతరలో అపశృతి చోటు చేసుకొని, మంచిర్యాల జిల్లాలో విషాదం నెలకొగా చెన్నూరు నియోజకవర్గంలోని బీమారం మండలంలో విషాదం చోటుచేసుకుంది వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లా,బీమారం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ యాదవ్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మేడారం సమ్మక సారలమ్మ జాతరకు వెళ్లారు. జంపన్న వాగులో స్నానం ఆచరిస్తున్న క్రమంలో శ్రీనివాస్ వాగులో పడి మృతి చెందినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బీమారం చేరుకొని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. శ్రీనివాస్ యాదవ్ కుటుంబాన్ని తమ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు పాటిస్తూ జాతరలో మొక్కులు చెల్లించుకోవాలని సూచించారు.



ఎస్ఎస్టీ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్

## ఎన్నికల నేపథ్యంలో పటిష్ట నిఘా..

**ఆసిఫాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్టీ చెక్‌పోస్ట్‌ను ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలు, ఎన్నికల నిబంధనల అమలును పర్యవేక్షించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. నగదు, మద్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.



పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు విజిత్ రావు

## అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

### - బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

**హాజీపూర్, జనవరి 29, ప్రభాతవార్త**

అధికార కాంగ్రెస్ పార్టీకి భారీషాక్ తగిలింది. గత పదిహేను సంవత్సరాల నుండి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు ముఖ్య అనుచరుడిగా ఉంటున్నా గుడిపేట, నంనూర్ తాజా మాజీ ఎంపీటీసీ ఒడ్డె బాల రాజు తన అనుచరులతో కలిసి గురువారం బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నివాసంలో ఆయన కుమారుడు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్ కుమార్, మాజీ ఎంపిటిసి బాలరాజు అతని అనుచరులకు పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. పార్టీ లో కష్టపడుతున్నా తనకు కార్పొరేటర్ టికెట్ ఇవ్వకుండా ఈరోజు వచ్చి కండువా కప్పుకున్న వారికి టికెట్ ఇస్తున్నారు అన్నారు. దింతో బిఆర్ఎస్ పార్టీలో చేరి కార్పొరేటర్‌గా పోటీచేస్తున్నట్లు బాలరాజు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17,18 డివిజన్ నంనూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ, గుడిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెల్లా రమేష్, వడ్డే సుధాకర్, గడిపెల్లి రాకేష్, వడ్డే పోషన్న, రావుల సత్యం ఉన్నారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, నంనూర్ గ్రామ మాజీ సర్పంచ్ బేర పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

**ఆసిఫాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు మార్చి 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తో కలిసి పలు శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులలో భాగమైన పాఠశాలలలో మూత్రశాలల నిర్మాణాలు, గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్వాడి భవనాలు, వంటశాలల నిర్మాణాలు, సిసి రహదారులు, ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం, గ్రామాలలో గ్రామ సమాఖ్య భవనాలను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పనుల బిల్లులను రికార్డు చేసి సమర్పించాలని, 10 లక్షల రూపాయలతో గ్రామ సమాఖ్య భవనాలను నిర్మించేందుకు జిల్లాలో 222 భవనాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మండలానికి ఒకటి చొప్పున 30 లక్షల రూపాయలతో ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం నిర్మాణం చేపట్టాలని, జిల్లాలోని 15 మండలాలలో 15 గోదాం నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ఎక్కడైనా స్థలం గుర్తింపు సమస్య ఉన్నట్లయితే స్థానిక తహసిల్దార్ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీలలో సర్పంచ్ లు ఉన్నందున వారి సహకారంతో పనులు వేగవంతం చేయాలని తెలిపారు. సంపూర్ణత అభియాన్ 2.0 లో భాగంగా బాలికలకు ప్రత్యేక మూత్రశాల నిర్మాణాలు చేపట్టాలని, అభివృద్ధి పనులలో ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మండలాల వారీగా పనుల పురోగతిపై సమీక్షించి నిర్దేశిత సమయంలోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధర్మేందర్, ఇంజనీరింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ పథకం ఏపిఓ లు, సెర్ప్ ఏ పి ఎం లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె హరిత

## కోసినిలో ఉచిత వైద్య పరీక్ష శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 29, ప్రభాతవార్త:**

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలోనీ డాడానగర్ లో గురువారం ఎస్పీయం వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ వాసాకే పుల్లాబాయ్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు శిబిరాన్ని ఎస్పీయం జీఎం ఎంఎస్ గిరి సందర్శించి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం జనరల్ మేనేజర్ ఎం ఎస్ గిరి, ఎలక్ట్రికల్ మేనేజర్ గిరి బాబు,ఎస్పీఎం డాక్టర్ శశిదర్ రెడ్డి, సిఎస్ఆర్ మేనేజర్ రేవతి, సుశీల, శివ, వైద్య సిబ్బంది తన్నీరు విజయ్ కుమార్, వాణి , ఉప సర్పంచ్ సాజిద్, గ్రామ పెద్దలు మాలి సంఘం కాగజ్నగర్ మండల్ జనరల్ సెక్రెటరీ హనుమంతు, వడై.రవి, రామయ్య, శ్రీనివాస్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీలో కాషాయ జెండా ఎగురవేయాలి

### - బిజెపి రాష్ట్ర నాయకులు గురువారెడ్డి

**లక్షెట్టిపేట, జనవరి 29, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీలో కాషాయ జెండా ఎగురవేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ దారం గురువారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 5వ వార్డులో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు, వార్డ్ ఇంచార్జ తగరపు గంగన్న, పార్టీ అభ్యర్థి కత్తెరపాక నరేష్‌తో కలిసి వార్డులోని ఇంటింటికి బిజెపి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బిజెపి బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, మున్సిపాలిటీలోని అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని, వార్డు అభివృద్ధి కొరకై సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి అభ్యర్థి నరేష్, తగరపు గంగన్న, నాగేందర్, మోహన్ రావు, ముత్తె సత్తయ్య, శంకర్రావు, ప్రభాకర్, మల్లయ్య, వార్డ్ సభ్యులు సుద్దాల సురేష్. చెన్నె ప్రవీణ్, అక్షయ, అశోక్, నవీన్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి పి నర్సారెడ్డి రెండవ వర్ధంతి

**సారంగాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో మాజీ మంత్రి పి నర్సారెడ్డి రెండవ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నిర్మల్ కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీ హరిరావు, మాజీ జెడ్పిటిసి పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం నర్సారెడ్డి స్వీయ చరిత్ర గ్రంథం జనహితమే జీవనవేదం పుస్తకాన్ని పలువురు కార్యకర్తలకు అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నర్సారెడ్డి మండల అభివృద్ధికి అపార భగీరథుడిగా కృషి చేశారని తెలిపారు. ఆయన ఎందరో రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని, ఉన్నతమైన లక్ష్యాలతో ప్రజాసేవకు అంకితమైన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అది, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ నారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ దశరథ రాజేశ్వర్, మాజీ అడెల్లి చైర్మన్ రాజేశ్వర్, సర్పంచ్‌లు లక్ష్మణ్, భూమన్న, సాయన్న, డైరెక్టర్లు భోజన్న, పోతారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లోజీ నర్సయ్య, మీడియా ఇంచార్జ సురేందర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు....

**ఆసిఫాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**

కలెక్టరేట్ సముదాయంలోని పలు జిల్లా కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల పనితీరు, ఉద్యోగుల హాజరు రిజిస్టర్ ను స్వయంగా పరిశీలించారు మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఖజానా, ముఖ్య ప్రణాళిక, సివిల్ సప్లై, వైద్య ఆరోగ్య శాఖ, కలెక్టరేట్ లోని రెవెన్యు విభాగం కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖ నిర్వహించి సమయానికి రాని సిబ్బంది వివరాలను వారు ఎక్కడి నుండి రాకపోకలు సాగిస్తారని, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ,సిబ్బంది సమయపాలన పాటించి విధుల పట్ల అంకితభావంతో చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారితో సహనంతో మెలగాలన్నారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇక ముందు సమయపాలన పాటించని అధికారులను, సిబ్బందిని ఉపేక్షించబోమని అన్నారు. ఆలస్యంగా వచ్చే అధికారులను, సిబ్బందిని సిసి ఫుటేజ్ ద్వారా గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమములో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



జిల్లా సంక్షేమ కార్యాలయంలో ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కే.హరిత